# జాతీయ స్వాతంత్ర్య పోరాటం మరియు భారత సాయుధ బలగాలు

*(చిట్టగాంగ్ ఉద్యమ స్వర్ణోత్సవాల సందర్భంగా 1981 సం॥లో ఢిల్లీలో జరిపిన సెమినార్‌లో ప్రవేశపెట్టిన పత్రం - సంపాదకుడు)*

సుబ్రత బెనర్జీ

**భారత** స్వాతంత్ర్య పోరాటాన్ని రష్యా మహత్తర సోషలిస్టు విప్లవంతో ఏ రీతిగానూ పోల్చలేము. బ్రిటీషు వారినుండి భారతీయులకు జరిగిన అధికార మార్పిడి, ప్రభుత్వాలలో జరిగిన మార్పిడి మాత్రమే. పాత సామ్రాజ్యవాద ప్రభుత్వం తన స్థానాన్ని నూతన ప్రభుత్వానికి విడిచి పెట్టింది. ఈ పరిమిత అర్థంలో అది ఒక విప్లవం. ఈ పరిస్థితుల్లో కూడా అది విజయానికి చేరువకావడానికి బ్రిటిష్ సాయుధ దళాలలో 'అసంఘటితత్వం' అవసరం అయింది.

ఈరోజు మనం చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడియొక్క స్వర్ణోత్సవాలను జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా నావికాదళ తిరుగుబాటును కూడా జ్ఞప్తికి తెచ్చుకోవాలి. 33 సం॥ల క్రితం ఖచ్చితంగా ఇదేరోజున ఆ వీర యువకులు ఓడిపోయే యుద్ధంలో కూడా పోరాడుతున్నారు. 1946 ఫిబ్రవరి 18న ఐఎంఎస్ తల్వార్ నావికులు సమ్మెకు వెళ్ళిన మరుసటిరోజే బ్రిటీషు ప్రధానమంత్రి క్లెమెంట్ అట్లీ భారతదేశంలో బ్రిటీషు సామ్రాజ్య పరిసమాప్తికి నిర్ణయంచేస్తూ ప్రకటనచేయటం బహుశా యాదృచ్ఛికం కాదు.

1857 సం॥ భారత సైనికులు స్వాతంత్ర్య పోరాటంలో సంఘటితంగా పాల్గొనటానికి ప్రారంభంగా గుర్తించబడింది. 1946లో అది ఉచ్ఛస్థితిలో వుంది. మధ్యలోని తొమ్మిది దశాబ్దాలకాలంలో చాలా జరిగాయి. వాటిలో మొదటిది–చిన్న విప్లవ సమూహాలలోని వ్యక్తులు చేసిన ఆకస్మిక, నాటకీయ, హింసాత్మక చర్యల వరుస. రెండవది – రాజ్యాంగబద్ధ ఉద్యమంగా అందరికీ తెలిసిందే. చిన్న చిన్నగా మొదలైన ఈ ఉద్యమాన్ని గాంధీ తన నాయకత్వంతో ప్రజాఉద్యమంగా మలిచాడు.

భారత సైనిక దళాలయొక్క మూలాలు ఈస్టిండియా కంపెనీ యొక్క ప్రారంభ దినాల్లోనే వున్నాయి. అది 17వ శతాబ్దం. భారత దేశంలోని వివిధ ప్రాంతాలలో కంపెనీ నెలకొల్పిన తమ పరిశ్రమలను రక్షించుటకు భారతీయులను భద్రతా సిబ్బందిగా నియమించుకొన్నది. ఆ శతాబ్దం చివరినాటికి మద్రాసు, బొంబాయి, కలకత్తాలలో మూడు స్థావరాలు కంపెనీ ఆక్రమణలోకి వచ్చాయి. వీటి చుట్టూ వారి స్వంతసైన్యంతో పరిపాలనా వ్యవస్థలు అభివృద్ధి చెందాయి. యూరోపియన్లు ఈ సైనంలోకి స్థానికులనుగానీ లేదా విదేశీయులనుగానీ చేర్చు కొన్నారు. భారతీయ సిపాయిలు ఈ సైన్యంలో సేవలందించారు. ఈవిధంగా బ్రిటీషు పాలకుల అవసరాలు తీర్చడానికి భారతీయ అధికారుల క్రింద పనిచేసేవిధంగా సిపాయిలతోకూడిన సాయుధబలగం ఉద్భవించింది. ఈ దశలో బ్రిటీషు సైనికులు కూడా భారతీయ అధికారుల క్రిందనే పనిచేసేవారు.

1734 సం॥ మధ్యలో బ్రిటీషు సైనిక పటాలాలు భారతదేశం తరలివచ్చాయి. ఆపుడు కంపెనీ తన బలగాలను రాజుగారి సేనలు, కంపెనీయొక్క యూరోపియన్ సేన, కంపెనీ యొక్క భారతీయ సిపాయిలు అనే మూడు వర్గాలుగా పునఃవ్యవస్థీకరించింది. ఈ మూడు వర్గాల మిశ్రమం ఏకశిలా సదృశంగా ఏర్పడ టానికి కొన్ని సంవత్సరాల సమయం పట్టింది. ఈ క్రమంలో భారతీయ అధికారులు తమ గౌరవాన్ని, శాసించే అధికారాన్ని కోల్పోయారు. 1857లో జరిగిన భారత సిపాయిల యొక్క మొదటి సంఘటిత తిరుగుబాటుకు దోహదం చేసిన కారణాలలో ఇది ఒకటిగా వుంది.

సిపాయిల బలగాలు కిరాయిసైన్యంగా వుంది. ఇది 1757 నుండి 1857 మధ్య ఇరవై యుద్ధాలలో పోరాడింది. భారత ఉపఖండంలో తూర్పున బర్మానుండి పశ్చిమాన కాబూల్ వరకు పూర్తిగా బ్రిటీషు వారు ఆక్రమించటానికి ఈ యుద్ధాలు దోహదపడ్డాయి. దేశాన్ని పూర్తిగా సైనికులు ఆక్రమించిన తరువాత, సిపాయి బలగాల యొక్క పాత్రను, స్వభావాన్ని మార్చి వేశారు. ఈ పరివర్తనను కార్ల్‌మార్క్స్ చాలా బాగా వివరించారు:

"సింధు, పంజాబ్‌ల ఆక్రమణ తరువాత బ్రిటీషు ఇండియా సామ్రాజ్యం తన సహజ హద్దులను చేరుకోవడమేగాక, స్వతంత్ర భారత రాజ్యాల అవశేషాలను కూడా తుడిచిపెట్టింది. ఇందువల్ల ఈస్ట్ఇండియా కంపెనీ యొక్క స్థితిలో బృహత్తర మార్పు చోటుచేసుకుంది. అది ఇంక ఎంత మాత్రమూ ఒక ప్రాంతంపై ఆధారపడి మరో ప్రాంతంపై దాడిచేయవలసిన అవసరం లేకుండా, ముఖ్య ప్రాంతాలలో కుదురుకొని అఖండ భారతాన్ని తన పాదాక్రాంతం చేసుకొంది. ఇంక జయించవలసినవి ఏమీ లేని విజేతగా నిలిచింది. బ్రిటిష్ సేనలు రాజ్యాల విస్తరణకు కాక రాజ్యనిర్వహణకు మాత్రమే వినియోగించ బడ్డాయి. కొందరు సైనికులను రక్షక భటులుగా మార్చారు. 20 కోట్ల భారతీయులు 2 లక్షలుగా వున్న ఆంగ్లేయుల నాయకత్వంలోని భారతీయ సిపాయిలద్వారా అదుపుచేయబడ్డారు. తిరిగి ఈ సిపాయిలు 40వేల మంది మాత్రమే వున్న ఇంగ్లీషు సేనచే అదుపుచేయబడింది. స్పష్టంగా వున్న అభిప్రాయం ఏమిటంటే బ్రిటీషు అధికారాన్ని స్థాపించిన స్థానిక సైన్యంయొక్క విధేయత మీదనే, భారత ప్రజల విధేయత, విశ్వసనీయత ప్రతిష్టించబడింది. భారతీయు లందరూ కలిగివున్న వ్యతిరేకతను, మొదటి సాధారణ ప్రతిఘటనా కేంద్రంగా వ్యవస్థీకృతం చేయటాన్ని సైన్యం ఏకకాలంలో నిర్వహించింది. (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం 1857–1859, కె.మార్క్స్ మరియు ఎఫ్.ఏంగెల్స్ ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్, మాస్కో ఇంగ్లీషు– పే.39–40)

కంపెనీ సేనలో భారతీయ సిపాయిలు 1857లోనే మొదటిసారిగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారనే ఆలోచన సరైనది కాదు. వేర్వేరు కారణాలతో అంతకుముందే ప్రసిద్ధి చెందిన అనేక పితూరీలు జరిగాయనేది గుర్తుంచుకోవాలి. భారత

సిపాయిలను పోరులుగా కొనసాగకుండా నిలిపివేయలేదు. సైనిక శిబిరాలలో కవాతు చేస్తూనే ప్రజలతో కలిసి వుండేవారు. వారు స్నేహితులతో సంబంధం ఏర్పరచుకొని బజారులలో సమాచారాన్ని తెలుసుకుంటూ వుండేవారు. వారు సాధారణ ప్రజలయొక్క బాధలతో, భావాలతో ప్రభావితం అయ్యేవారు.

భారతదేశం యొక్క చరిత్రను కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ఒకదాని తరువాత మరొక ఘటనగా గ్రంధస్తం చేసినది. ప్రతిసారీ తిరుగుబాటుకు నేతృత్వం వహించిన వారిని, వారి సహచరుల ముందే తుపాకులతో పేల్చేసేవారు. గ్రంధస్తం చేయబడిన మొదటి ఘటన 1764లో జరిగింది. అది చాలా అలజడిగా వున్న సంవత్సరం. సర్‌జాన్ కాయే ప్రకారం సిపాయి పటాలం బ్రిటీషు అధికారిని ఖైదు చేసింది. అది బెంగాల్‌లో సన్యాసి-ఫకీరు తిరుగుబాట్లు జరుగుతున్న కాలం.

1806 జులైలో వెల్లూరులో జరిగిన పితూరి స్పష్టమైన బ్రిటీషు వ్యతిరేక వైఖరిని కలిగియున్నది. టిప్పుసుల్తాన్ యొక్క మూడవ కుమారుని ప్రోద్బలంతో తిరుగుబాటు సైనికులు రాజప్రాకారంపై టిప్పుల జెండాను ఎగుర వేశారు. సుమారు 40 మంది తిరుగుబాటు దార్లను బ్రిటీషు ప్రభుత్వం చంపివేసింది.

1824లో బరాక్‌పూర్‌లోని 47వ దళం బర్మాపై బ్రిటీషు దండయాత్ర సందర్భంలో, విదేశీ నౌకరీ చేయడానికి నిరాకరించారు. వారిని ఫిరంగులకు కట్టివేసి కాల్చిచంపారు. భారత దేశంలో బ్రిటీషు సామ్రాజ్య విస్తరణతో, ఇంటికి దూరంగా ఏరకమైన సేవాబత్తెము లేకుండా సేవ జేసే కోటరక్షణ దళాల అవసరం విపరీతంగా పెరిగింది. 1835 తరువాత, సింధు ప్రాంతాన్ని కలుపుకొన్నాక, విశాలమైన ప్రాంతాలకు విస్తరించి, ముందుకంటే ఎక్కువ మందిని సమీకరించుకొని వరుస తిరుగుబాట్లు జరిగాయి. 1843, 1844 సం॥లలో 5 పదాతి దళాలు, 2 అశ్విక దళాలు మరికొన్ని ఫిరంగి దళాలు రక్షణ పనులను నిరాకరించాయి. తరువాత రెండు సంవత్సరాలలో కార్యరూపం దాల్చ కుండానే కొన్ని పథకాలుగా మిగిలిపోయాయి.

1849-1850లలో పంజాబ్ ప్రాంతాన్ని కొత్తగా ఆక్రమించిన తరువాత, కోటరక్షణ దళాల సమస్య తిరిగి తలెత్తింది. రావల్పిండిలో ఒక దళం, జీతంకోసం సమ్మె చేసింది. 66వ దళంలోని తిరుగుబాటుదారులను తొలగించి గుర్ఖాదళాన్ని ప్రవేశపెట్టటం, 1850లో వచ్చిన ముఖ్యమైన మార్పు. 1856లో మరలా బెంగాల్‌సేన, మద్రాస్‌సేన బర్మాలో విదేశీ నౌకరీ చేయడాన్ని తిరస్కరించాయి. విదేశీ నౌకరీ తమ ఒప్పందంలో భాగం కాదని సిపాయిలు పేర్కొన్నారు. ఈ స్థిర నిర్ణయానికి స్పందనగా, 1856 జులై 25న లార్డ్‌కానింగ్ దేశంలోపల, బయటా కూడా సాధారణ సేవలు నిర్బంధం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చాడు.

1857 మహత్తర ఉద్యమానికి దాదాపు 100 సం॥ల ముందు, ప్లాసీయుద్ధం నుండీ భారతీయ సిపాయిలు చేస్తున్న తిరుగుబాట్లకు ప్రజలనుండి సన్నిహితమైన సహకారం అందినట్లు నిదర్శనాలున్నాయి. ఒకదాని తరువాత ఒకటిగా రైతాంగ పోరాటాలు, భారత సాయుధ దళాల తిరుగుబాట్లు 1857లో పరాకాష్టకు చేరుకొన్నాయి. ఈ రెండు ఉద్యమాల మధ్య ప్రతిసారి ప్రత్యక్ష సంధానం వుండేది కాదు. కానీ ఒకదానిని మరొకటి పరోక్షంగా ప్రభావితం చేసుకొన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. తొలగించబడిన సిపాయిలు వివిధ రైతాంగ ఉద్యమాలలో చేరి వారికి కావల్సిన సైనిక నాయకత్వాన్ని అందించినట్లు అనేక ఆధారా లున్నాయి. వారియొక్క తక్షణ అనుభవాల ఫలితాలుగానే చాలా పోరాటాలు, తిరుగుబాట్లు జరిగాయి. తుదకు బ్రిటీషు శక్తిని ఎదుర్కొగలిగిన వారుగా వారిని వారు తెలుసుకున్నారు. అలా అనివార్యంగా విదేశీ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కొరకు పోరాట రూపాన్ని చేపట్టారు.

1857 తిరుగుబాటు నుండి బ్రిటీషు వారు కోల్పోయినది ఏమీ లేదని మార్క్స్ వివరించాడు. మొదటి స్వాతంత్ర్య సంగ్రామం నిర్దాక్షిణ్యంగా అణచివేయబడింది. భారతదేశం బ్రిటీషు రాచరికంయొక్క ప్రత్యక్షపాలన క్రిందకు వెళ్ళింది. సిపాయి బలగాలను పునఃవ్యవస్థీకరించారు. యుద్ధ సంబంధ జాతుల సిద్ధాంతం అనే సైనిక శాసనం రూపొందించారు. ఇది సైన్యంలో మునుపే మేధోపరంగా అభివృద్ధిచెందిన వారిని మినహాయించడానికి ఉద్దేశించబడినది. దళాల శిక్షణాకేంద్రాలలో సైనికులను వారి జాతి లేదా మత సంబంధమైన గౌరవం ద్వారా ఎదుగునట్లు ప్రోత్సహించేవారు. నూతనంగా నిర్మించబడిన దళాలకు వాటి కుల లేదా మత సంబంధమైన పేర్లు ఇవ్వబడ్డాయి. ఉదా:పంజాబ్ రెజిమెంట్, రాజపుత్ర రైఫిల్స్, కుయుమన్ రెజిమెంట్, సిక్కు లైట్ పదాతిదళం మొదలగునవి. బ్రిటీషు సామ్రాజ్య విస్తరణలో పాల్గొని పోరాడిన యుద్ధాల చరిత్రే, ఈ దళాల చరిత్ర. ఈ రకమైన సంప్రదాయాలను శిక్షణా కార్యక్రమాలలో భాగంగా చేర్చారు.

సాయుధ దళాలను ప్రజలనుంచి వేరు చేయటానికి ప్రభుత్వం ఆలోచించి కొన్ని చర్యలను చేపట్టింది. సైనిక కుటుంబాలు ప్రత్యేకంగా ఆహారాన్ని, వసతిని పొందాయి. పదవీ విరమణ చేసిన సైనికుల స్వంత అవసరాలను తీర్చు కొనుటకు భూకేటాయింపులు చేశారు. తిరిగి వారు నియామకాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను పొందారు. కొందరు తమ తండ్రులయొక్క దళం లోనే చేరారు. వారు గ్రామీణ ఉన్నతవర్గంగా రూపొందారు. ఇక అధికార శ్రేణికి వస్తే భారతీయ అధికారులను జమీందారీ ప్రభువుల నుండి నియమించేవారు. ఉన్నతవర్గ దృక్పధాన్ని అన్ని స్థాయిల్లోనూ జాగ్రత్తగా పెంచి పోషించారు.

పౌరజనాభాను హీనంగా చూసే దృష్టిని సైనికులు అలవర్చుకొన్నారు. ఈ విధంగా సైనికులను రక్షణభటులుగా మార్చే ప్రక్రియ సాగింది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న నిరాయుధులైన ప్రజలనుండి వారిని విడదీసే మార్గం ఇది మాత్రమే. చట్టాన్ని, శాంతి భద్రతలను రక్షించటంలో పౌర అధికారులకు సహాయంగా వుండటం మాత్రమే, భారతీయ సాయుధ దళాలయొక్క ముఖ్యకర్తవ్యంగా వుండేది. బ్రిటీషు అధీనంలోని భారత సామ్రాజ్యంయొక్క సరిహద్దుల రక్షణ మరియు ఆసియా, ఆఫ్రికా దేశాలలోని వేర్వేరు ప్రాంతాలలో బ్రిటీషు సామ్రాజ్యవాద యుద్ధాలకు సహాయక దళాలుగా పనిచేయటం వీరి మిగిలిన కర్తవ్యాలు. వీరు ఈ కర్తవ్యాలను అద్భుతంగా పూర్తిజేస్తే రాయల్ గర్వాల్ రైఫిల్స్ అంతటి రాజగుర్తింపును గెలుచుకొంటారు.

భారతీయ సిపాయిలు ఏవిధమైన ఐక్య కార్యాచరణలు చేపట్టకుండా, అడ్డుకొనే విధంగా పటాలాలు ఏర్పరచారు. ఉదాహరణకు ఒక పదాతి దళం – బ్రిటీషువాళ్ళు, గూర్ఖాలు, భారతీయులను కలిగి వుండేది. ఇంకొన్ని పటాలాలను మత, కులాల వారీగా విభజించారు. ఉదాహరణకు సిక్కుదళంలో మహర్ పటాలం వుండేది. మరొక దళంలో 50% పంజాబీలు, ముస్లిములు మరియు ఉత్తరప్రదేశ్ హిందువు లతో మిగిలినదళం కూర్చబడేది. రాజుచే నియమింపబడిన 'సందురుస్ట్ శిక్షణ' పొందిన అధికారులకు భిన్నంగా వైశ్రాయ్‌చే నియమింప బడిన భారతీయ అధికారుల వర్గం (విసిఒ) ఒకటి వుండేది. వీరు పరిపాలనా విభాగానికి వెన్నెముకగా ఏర్పడ్డారు. కుల, మత విభాగాలలోని ఒక భాగము తమ సమస్యలకు, బాధలకు ఈ విసిఒలు సరైన న్యాయం చేయరు అనే భావనలో వుండేవారు. బ్రిటీషు అధికారి న్యాయానికి అంతిమ నిర్ణేతగా వుండి, తల్లీ తండ్రిగా భావించబడేవాడు. అయితే తల్లీ తండ్రిగా వుండవలసిన విసిఒ కష్టం కలిగించే క్రమశిక్షణా చర్యలు అమలుచేసేవాడు.

భారతీయ సైనికులను ప్రజలనుంచి వేరు చేయుటకు ఇంతకంటే కట్టుదిట్టమైన మార్గాలు ఏమీ వుండవు. భారత సాయుధ దళాలు, కిరాయి సైనిక వృత్తిలో వున్నట్లే బ్రిటిష్‌వారు భావించారు. భారత సిపాయిలపట్ల వారికున్న అపరిమితమైన ద్వేషం జాతీయోద్యమంయొక్క ఉచ్ఛదశలో ప్రస్ఫుటంగా బయల్పడింది. మన జాతీయ చైతన్యం అభివృద్ధి నమూనా మాదిరిగానే ఏకాకులను చేయటం మరింతగా దృఢపరచ బడింది. అంతిమంగా పోరాటంయొక్క ప్రధాన రూపాన్ని సిపాయిలు స్వీకరించారు.

సాయుధ తిరుగుబాటును ఉత్తేజపరిచే చర్యగా వ్యక్తిగత తీవ్రవాదం ప్రదర్శించబడింది. ఢిల్లీలో లార్డ్ హార్డింగ్‌పై హత్యాయత్నం జరిగిన వార్షికోత్సవం సందర్భంగా 1919 డిసెంబరు 23న, ఢిల్లీలో 'శభాష్' అను కరపత్రం ప్రత్యక్షం అయింది. వైశ్రాయ్‌పై విసిరిన బాంబుని ఉటంకిస్తూ కరపత్రంలో "బాంబు గర్జన" అనేది దేశప్రజల గొంతుకగా అభివర్ణించబడింది. శిబిరాల్లో వున్న వారిని భౌతికంగా కలవటం కష్టం కనుక ఇది భారత సైనికులకు స్వాతంత్ర్య సందేశాన్ని అందివ్వడంలో తోడ్పడింది. బ్రిటీషు ప్రభుత్వం అంతం కాబోతున్నందున ధైర్య వంతులైన భారతీయులు యుద్ధరంగంలోకి దూకాలనేది దానిలో సందేశం.

సాయుధ దళాల్లో బ్రిటిష్ వ్యతిరేక భావన లను వ్యాప్తిచేయటానికి మొదటి ప్రపంచయుద్ధం భారతీయ విప్లవకారులకు గొప్ప అవకాశాలను కల్పించింది. 1914, 1915లలో సాయుధ తిరుగుబాటును ప్రేరేపించే ముఖ్యమైన ప్రయత్నాలు జరిగాయి. గదర్‌పార్టీ పంజాబులో చురుకుగా వుంది. లాహోరుకు సమీపంలోని మెయిన్‌మిర్‌లో 23వ అశ్వికదళంపై 1914 నవంబరులో తిరుగుబాటుదారులు దాడి ప్రయత్నం చేశారు. ఆకాలంలో సమాచారం బయటకు పొక్కడంవల్ల ఓడిపోయారు. ఆ సమయంలో విష్ణుగణేశ్‌పింగళే పంజాబ్‌కు వచ్చాడు. లూధియానా విద్యార్థి అయిన సచాసింగ్ మరియు రసబిహారీ బోస్‌లతో జత కలిశారు. 9వ బెంగాలీ పదాతి దళానికి చెందిన విశ్రాంత సైనికుడిని తమలో చేర్చుకొనుటలో సచాసింగ్ సఫలీకృతుడైనాడు. ఈ సైనికుడే తర్వాత సైనికదళ బజారుకు "చౌదరి" అయ్యాడు. అతను సైనికులతో సంబంధాలు ఏర్పరుచు కొనుటకు సహాయం చేశాడు.

మీరట్, కాన్పూర్, అల్హాబాద్, బెనారస్, ఫైజాబాద్, లక్నోలలో రహస్య సమావేశాలు జరిగాయి. 'గదర్' నాయకత్వంలో లాహోర్‌లోని 23వ అశ్వికదళం, ఫిరోజ్‌పూర్‌లోని 26వ పంజాబ్‌దళం, 42వ డియోలిపటాలం, బెనారస్ లోని 7వ రాజపుత్ దళం, దైనేపూర్‌లోని 89వ పంజాబ్ దళం మొదలైన వాటిలో సమాచార వ్యాప్తి జరిగింది. సాధారణ తిరుగుబాటుకు పథక రచన చేయబడింది. 1915 ఫిబ్రవరి 21న లాహోర్‌లో ప్రారంభించాలని సంకేతం ఇవ్వబడింది. సమాచారం తెలిసిపోతుందనే భయంతో తేదీని రెండురోజులు వాయిదా వేశారు. ఈ గందరగోళంలో సమాచారం బయటకు పొక్కి అనేకమంది నాయకులు అరెస్టు చేయబడ్డారు. గదర్ ప్రభావంతో బర్మాలో కూడా 130వ బెలూచ్ పటాలం 1915లో జనవరి తిరుగుబాటుకు సిద్ధంగా వుంది. ఫిరంగుల దళం, సైనిక రక్షకభటులు కూడా పితూరీలు చేశారు. చాలామంది పట్టుబడి శిక్షించబడ్డారు.

అయినప్పటికీ విప్లవకారులు తేలికగా వదలి పెట్టడానికి సిద్ధంగా లేరు. వారి ప్రయత్నాలు కొనసాగాయి. బర్కతుల్లా మొదలగు దేశబహిష్కృతులు తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుచేసి జర్మన్‌లు బంధించిన యుద్ధఖైదీల మధ్య పని ప్రారంభించారు. వివిధ భాషలలో కరపత్రాలు ప్రచురించి, రహస్యంగా దేశంలోకి తెచ్చి సైనిక దళాల మధ్య విస్తృతంగా పంపిణీ చేశారు. 1915 మార్చి 23న 12వ అశ్విక దళం చేతుల్లో పింగళే ఖైదు చేయబడ్డాడు. జూన్‌లో 8వ అశ్వికదళంలోని కొందరు భారతీయ సిపాయిలు, అనేకమంది బ్రిటీషు అధికార్లను, సైనికులను చంపారు. చివరకు ఈ ప్రయత్నాలన్ని విఫలం అయినాయి. అనేకమంది దేశభక్తులు, పౌరులు, సిపాయిలు మనదేశ ప్రజల గౌరవాన్ని పొందకుండానే, వారిచే కీర్తింపబడకుండానే, సైనిక న్యాయస్థానాల్లో బూటకపు విచారణల అనంతరం ఉరితీయబడ్డారు; జైలుశిక్షలు అనుభవించారు.

సాయుధ తిరుగుబాట్లను సమరశీల ప్రజా ఉద్యమాలతో అనుసంధానం చేయలేకపోవటం, ఈ ప్రయత్నాలు విఫలం కావడానికి ముఖ్య కారణాలలో ఒకటి. యుద్ధానంతర సంవత్స రాలలో గాంధీ జాతీయ పోరాటానికి జనసమీకరణ అనే నూతన పరిణామంద్వారా పిలుపునిచ్చాక ఈ అనుసంధానానికి అవకాశాలు ఏర్పడ్డాయి. అదే సమయంలో గాంధీ అహింస, సహాయ నిరాకరణవంటి పోరాట రూపాలద్వారా జనబాహుళ్యం యొక్క కార్యాచరణకు హద్దులు ఏర్పరచాడు. అతను పోరాటంలో సైనిక బలగాల పాత్రను గుర్తించాడు. "మెసపటోమియాలో నౌకరీ చేయటాన్ని తిరస్కరించటానికి" మాత్రమే వారిని పరిమితం చేశాడు. (మహాత్మా డి.జి. తెందూల్కర్. వాల్యూమ్.2, పేజీ 10)

శాసనోల్లంఘన సమయంలో గాంధీ బ్రిటీషు ప్రభుత్వాన్ని అవినీతికర దుష్ట రాజ్యంగా పేర్కొని అవిధేయతా మార్గాన్ని ప్రబోధించాడు. "వాస్తవంగా అవినీతికర రాజ్యానికి విధేయులై వుండటమే పాపమని, అవిధేయతే ధర్మం" అని ప్రకటించాడు. అతను ఇంకా ముందుకు వెళ్ళి ఇలా చెప్పాడు: "వ్యవస్థయొక్క దుష్టస్వభావాన్ని గుర్తించిన వారి బాధ్యత ఏమంటే, ఆ వ్యవస్థ

యొక్క కొన్ని లక్షణాలు కొన్ని సందర్భాలలో ఆకర్షణీయంగా వున్నప్పటికీ, లేదా అలా కనిపించినప్పటికీ, దానిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా వానిని ధ్వంసం చేయవలసిందే". అదే సమయంలో గాంధీ ఒకే ఒక్క పోరాట రూపంగా అహింసనే నొక్కి చెప్పాడు. దుష్టత్వాన్నుండి తనకు తాను విడగొట్టుకొనే వానికి, అహింస, శాసనోల్లంఘన మాత్రమే ఏకైక మరియు అత్యంత సరైన విరుగుడుగా అనుసరించవలసిన కర్తవ్యం" అని చెప్పాడు. (మహాత్మా వాల్యూమ్:3 పేజీ 25 నుండి 27 వరకు)

ఇక, సాయుధ దళాలకు సంబంధించి నంతవరకు బ్రిటిష్‌వారిపట్ల అవిధేయతను ఆ స్థాయిలో గాంధీ వీరికి బోధించలేదు. నావికాదళ తిరుగుబాటుపట్ల తన దృక్పథాన్ని వివరిస్తూ ఈ విషయాన్ని గాంధీ చాలా బాగా స్పష్టపరిచాడు. సహాయ నిరాకరణోద్యమ సందర్భంలో తన ప్రకటనను తిరిగి గుర్తుచేస్తూ గాంధీ ఇలా అన్నాడు: "సైనికులు భారతదేశాన్ని స్వాతంత్ర్యం చేయటంకోసం, స్వాతంత్ర్యంగా వుంచటంకోసం సైనిక కార్యకలాపాలు చేయవలసిందే, వారి పొట్ట కోసం కాదు. వారు, వారికి వేతనం చెల్లిస్తున్న ప్రభుత్వానికి-అది ప్రస్తుత ప్రభుత్వమైనా, రేపటి దైనా-అవిధేయులుగా వుండటాన్ని అంగీకరించను" (మహాత్మా, వాల్యూమ్, 7 పేజీ 72)

ఈ రకమైన దృక్పథం జాతీయోద్యమానికి, సాయుధ దళాలకు మధ్య భావప్రసారాన్ని అభివృద్ధిచేయాలనే అంశాన్నే తిరస్కరించింది. వారు కిరాయి సైనికులుగానే చివరివరకు వుండాలని, ఎవరి ఉప్పు తింటున్నారో వారిపట్ల రాజభక్తిని ప్రదర్శించాలనే బోధకులకు లోనయ్యారు. గాంధీ ప్రబోధించిన ఈ ఆలోచనా విధానం సాయుధ పోరాట అవగాహనను ఆమోదించే కమ్యూనిస్టు, సోషలిస్టులతోసహా దేశంలోని వివిధ విప్లవశక్తులు, సాయుధబలగాలతో సంబంధాలను ఏర్పరచుకోవాలని ఏనాడూ సీరియస్‌గా ఆలోచించ లేనంతగా తీవ్రంగా ప్రభావితం చేసింది.

గాంధేయవాద ఉద్యమ పొత్తిళ్ళనుండి ఆవిర్భవించిన, విప్లవంయొక్క ఈ కీలక స్థితిపై మార్క్స్, లెనిన్‌ల బోధనలను వారు ఆమోదించి, అనుసరించలేదు. భారత సైన్యాన్ని సృష్టించటంతో, భారతీయులు సాగిస్తున్న ప్రతిఘటనకు మొదటి సాధారణ కేంద్రాన్ని బ్రిటిష్ పాలన క్రమంగా ఏర్పాటు చేసిందనేదాన్ని అర్థం చేసుకోవటంలో వారు విఫలం అయ్యారు. 1857 అనుభవాల నుండి మార్క్స్ ఈ పాఠాన్ని రాబట్టాడు. తరువాత తరం విప్లవకారులు ఈ పాఠాన్ని నేర్చుకోలేక పోయారు. "సైన్యాన్ని చెదరగొట్టకుండా ఏ గొప్ప విప్లవం కూడా ఇప్పటివరకు రాలేదు, ఇంక ముందు కూడా రాబోదు" అనే లెనిన్ ప్రకటనకు కూడా ఇది సమంగా వర్తిస్తుంది.

ఇటువంటి స్థితిలో భారతీయ సాయుధ దళాలు కిరాయి సైనికులుగా రాజభక్తితో వుండి పోవటం, కొనసాగటం సహజంగానే జరిగింది. దీనికి అక్కడక్కడ మినహాయింపులున్నాయి. ప్రజలనుంచి ఏకాకులుగా చేయటమన్నది ఎక్కడా నిజంగా పూర్తికాలేదు. భారత స్వాతంత్ర్య పోరాటం క్రియాశీలతను, వేగాన్ని పొందినపుడు ఆ ప్రభావం భారత సైనికులపై కూడా వుంది. చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడియొక్క ప్రతిధ్వనులు, షోలాపూర్‌ను కార్మికులు స్వాధీనం చేసుకొన్న ప్రకంపనలు దరిచేరకుండా సిపాయిలు ఎలా వుండగలుగుతారు?

చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి 1931 ఏప్రిల్ 18న జరిగింది. కేవలం ఐదురోజుల తరువాత ఏప్రిల్ 23న పెషావర్‌లో నిరాయుధులైన ప్రదర్శనకారులపై కాల్పులు జరపటానికి 13వ రాయల్ గర్వాలి రైఫిల్స్‌కు చెందిన రెండవ సిపాయి పటాలాలు రెండూ తిరస్కరించాయి. ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌ను నిర్బంధించిన ప్రాంతాన్ని వేలాదిమంది ముస్లిములు చుట్టుముట్టారు. హిందూ సిపాయిలను ఉపయోగించుకొని మత మారణ హోమం సృష్టించాలన్న బ్రిటీషు కుటిలయత్నం విఫలం అయింది. బ్రిటీషర్లు వెనుకకు తగ్గక తప్పలేదు. మే 4 వరకు పెషావర్ ప్రజల చేతుల్లోనే వుంది. ప్రజల పక్షానికి సైనిక దళాలు వస్తే ఏమి జరుగుతుందనే దానికి ఇది మరో ఉదాహరణ.

గర్వాలి సైనికులు ప్రముఖంగా హింసాత్మక మైన వారు కాదు. వారు తమ ఆయుధాలను ఇచ్చివేశారు. గాంధీ భావించిన ప్రకారం వారు స్పష్టంగా ప్రభుత్వానికి 'అవిధేయులు' మాత్రమే. ఇది అరిష్టమనీ, దీనిని వెంటనే నాశనం చేయమనీ ఆయన అంతకుముందే ప్రజలకు పిలుపునిచ్చాడు. గాంధీ-ఇర్విన్‌ల శాసనోల్లంఘన ఉపసంహరణ ఒడంబడికలో సంతకం చేసే టపుడు గాంధీ ఈ సైనికుల విడుదల అంశాన్ని చేర్చకపోవడానికి వీరి 'అవిధేయత' ఒకానొక కారణం కావచ్చు. గాంధీ వివరణ ఇలా వుంది: "మేము సంప్రదింపుల ద్వారా తీసుకురాగలినంత ఒత్తిడి తీసుకువచ్చి న్యాయంగా తాత్కాలిక పరిష్కారాన్ని పొందామని మేము సంతృప్తి చెందాం. తాత్కాలిక సంధికోసం చర్చలు జరుపుతూ సత్యం, అహింసలపై మన ప్రతిజ్ఞలను మరచిపోయి వ్యవహరించలేము". (మహాత్మా, వాల్యూమ్ 3, పేజి. 63) దీని తరువాత జాతీయోద్యమ ప్రధానస్రవంతిలోకి సైనికులు చేరుతారని ఎవరైనా ఎలా భావించగలుగుతారు?!

అపుడే రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభ మైంది. ఆ యుద్ధం యొక్క స్వభావం, అది వృద్ధిచెందిన తీరు, విభిన్న ప్రేరణలు కలిగిన పూర్తి నూతన తరహా సైన్యం ఆ యుద్ధంలోకి అవసరమైంది. ఈ యుద్ధం భారత సాయుధ దళాల బలాన్ని విస్తారంగా పెంచింది. పాత నిర్బంధ విధానాలు ఇక ఎంత మాత్రమూ కొనసాగజాలని స్థితి ఏర్పడింది. పూర్తి యుద్ధ అవివార్యతల కారణంగా, వారి సంకుచిత వాంఛలను, యుద్ధ రాజకీయాలను అధిగమించి సాయుధ దళాలను ప్రజలముందు ప్రదర్శించటం బ్రిటీష్ సామ్రాజ్యవాద ప్రభుత్వానికి తప్పనిసరి అయింది.

ఇది ఏమీ అంత తేలికైన వ్యవహారం కాదు. యుద్ధం గురించి ప్రాచుర్యంపొందే ఉత్సుకత ఏమీ సృష్టించలేదు. వాస్తవానికి ఆర్థిక అంశాలు మాత్రమే ప్రేరణగా వున్నాయి. వందల, వేల సంఖ్యలో ఆకలిగొన్న రైతులు సైన్యంలో చేర్చుకో బడ్డారు. సాంకేతిక మరియు గుమస్తా పనులలో మధ్యతరగతి విద్యావంతులు పెద్దసంఖ్యలో చేరారు. వీరిలో చాలామంది వివిధ ప్రాచుర్యం పొందిన

పోరాటాల్లో పాల్గొన్నారు; అలా కాక పోయినా, మిగిలినవారు కనీసం జాతీయోద్యమ ప్రభావానికి లోనైన వారుగా వున్నారు. వారందరూ స్వాతంత్ర్యాన్ని కాంక్షించారు కానీ ఆర్థిక ఒత్తిళ్ళు అనివార్యంగా వున్నాయి. సాయుధ దళాలలో చేరటం తక్షణ పరిష్కారాన్ని సమకూర్చాయి.

1943 వచ్చేసరికి ఈ కిరాయి సైనికులు పదింతలుగా వృద్ధిచెంది 20 లక్షల సంఖ్యకు చేరుకుంది. వీరు సాయుధ శిక్షణను వేగవంతం చేయటమేగాక, యుద్ధంయొక్క రాజకీయాలను కూడా అందుకొన్నారు. సందేహాస్పదులుగావున్న భారతీయ సైనికులు – నియంతృత్వం గురించి, బానిసత్వంలో వున్న ప్రజలకు స్వాతంత్ర్యాన్ని సాధించే యుద్ధం గురించి, ఇంకా రెడార్మీయొక్క వీరోచిత పాత్ర గురించి తెలుసుకున్నారు.

ఈ సైన్యం జర్మనీ, ఇటలీ మరియు జపాన్‌లయొక్క క్రూర నియంతృత్వం నుండి అనేక దేశాలప్రజలు స్వాతంత్ర్యంకొరకు ప్రపంచ వ్యాప్తంగా చేసిన పోరాటాలలో పాల్గొంది. ఈ కిరాయి సైనికులు తమ తెల్లదొరలతో భుజం భుజం కలిపి పోరాడి, తిరుగులేని అజేయశక్తిగా చెప్పుకొనే జర్మనీ, ఇటలీకి చెందిన తెల్ల సైనికులకు, జపాన్ మిత్రసేనలకు చెంపపెట్టు లాంటి ఓటమిని చూపించాయి. ప్రజలను బానిసత్వంలోకి నెట్టేందుకు తెల్లదొరలకు సహాయంగా పోరాడిన తమ పూర్వపు సిపాయిలకు భిన్నంగా వీరు ఎంతో భిన్నమైన పాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో భారతీయ సైనికులు పరివర్తన చెందారు.

ఈ పరిణామాన్ని చూసేందుకు, ఈ అనుభవాలను మీతో పంచుకొనేందుకు నాకు అవకాశం కలిగింది. 1945లో నేను భారత సైన్యంతో కలిసి బర్మా, ఇండో–చైనాలలో పని చేశాను. వారే బర్మా యుద్ధం గెలిచారు. ఉత్తర ఆఫ్రికా ఎడారుల్లో, ఇటలీ, గ్రీస్, ఇంకా మధ్యధరా సముద్ర ప్రాంతాల్లో విజయాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని, గౌరవ భావాన్ని పెంచాయి.

నిజంగా నెలజీతం పొందే నామమాత్రపు బత్తేనికే వారు తమ ప్రాణాలు ఒడ్డారా? బ్రిటీషు వారు తెలివిగా భారతీయ సైనికులలో నిగూఢంగా వున్న జాతిగౌరవాన్ని ఉపయోగించుకొని, యుద్ధంలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చేవిధంగా వారిని ప్రేరేపించారు. మరాఠా, రాజ్‌పుత్, పంజాబి, జాట్, ప్రతిఒక్కరూ తమ జాతి సంప్రదాయాన్ని నిలబెట్టేవిధంగా పోరాడారు. 1945 వేసవిలో రాజకీయంగా చైతన్యప్రాంతమైన మధ్య బర్మాలోకి మేము ప్రవేశించినపుడు, మమ్మల్ని విముక్తి చేసే వారిగా ఆదేశ ప్రజలు మాకు అభివాదం చేశారు. ఇదేవిధమైన అనుభవాలు భారతీయ సైనికులకు ఇటలీ, గ్రీస్ తరువాత ఇండో–చైనా, మలయా, ఇండేనేషియాలలో కూడా కలిగాయి. ఇరాన్‌లో రెడ్‌ఆర్మీని కలిశారు. యూనిఫాంలోని భారత రైతుకు ఇది దిగ్భ్రమపరిచే అనుభూతి. తనకు తానే స్వేచ్ఛ లేనివాడు, ఇతరులను ఎలా విముక్తి చేయగలడు? ఇక ఆ తరువాత అంతా అతను నిజంగానే నిజమైన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడా? యుద్ధం ముగిసేసరికి భారతదేశం స్వేచ్ఛను పొందిందా? విద్యావంతులైన యువ సాంకేతిక నిపుణులు, పారిశ్రామిక కార్మికులు, పేదరైతులు – వర్గపోరాటం లేదా రాజకీయ ఉద్యమాల్లో ఎవరైతే పాల్గొన్నారో లేదా దగ్గరగా చూశారో వారికి ఈ ప్రశ్నలన్నీ చాలా కీలకమైనవి.

అపుడు పరిస్థితిలో మరలా మార్పు వచ్చింది. గ్రీస్, బర్మా, ఇండో–చైనా, మలయా, ఇండోనేషియాలోని భారతీయ సైనికులు తమను విముక్తి చెందించేవారిగా భావించిన ప్రజలకి తాము వ్యతిరేకంగా వున్నామని గుర్తించారు. సైగాన్‌లో తమ గతకాలపు శత్రువైన జపాన్ సైనికులతో కలిసి పౌరజనాభాకు వ్యతిరేకంగా పోరాడమన్నారు. దీనిపట్ల సైనికులు తమ ఆగ్రహాన్ని బహిరంగంగా తెలియపర్చారు. ప్రజలతో పోరాడటానికి సైనికులు సిద్ధంగా లేరు అని అన్నారు. “వాళ్ళేమీ తప్పు చేయలేదు, స్వాతంత్ర్యాన్ని కోరుకొంటున్నారు. ఇది అందరి ప్రజల స్వాతంత్ర్యంకొరకు జరుగుతున్న యుద్ధం కాదా?” అని ప్రశ్నించారు. వియత్నాం పట్టణ గెరిల్లా వ్యతిరేక చర్యలనుండి భారతీయులను ప్రక్కనపెట్టి గూర్ఖాలను ముందుకు తెచ్చిపెట్టారు.

ఈలోగా భారతదేశంలోని సాయుధ దళాలలో గందరగోళం ఏర్పడింది. యుద్ధ ప్రారంభ సంవత్సరాలలో 21వ అశ్వికదళానికి చెందిన 114 మంది దేశం బయటకు వెళ్ళి సామ్రాజ్యవాద యుద్ధంలో పాల్గొనటాన్ని తిరస్క రించారు. వారిలో నలుగురిని వురి తీశారు, మిగిలినవారు ఖైదు చేయబడ్డారు. 1942లో ఆగస్టు ఉద్యమ మేలుకొలుపుతో భారతీయ సైనికులు చేసిన అనేక కార్యాచరణలు నిర్దాక్షిణ్యంగా అణచివేయబడ్డాయి. మార్చి 1942 నుండి ఏప్రిల్ 1945 మధ్య భారత నౌకాదళం ఒక్కటే 19 తిరుగుబాట్లు చేసింది. ఇవి జాతి వివక్షతపైన, ఇంకా అనేక కోర్కెలకు సంబంధించినవి. 1944లో సుమారు 400 మంది రైల్వేరక్షక విభాగం సైనికులు తమపై అన్యాయమైన క్రమశిక్షణా చర్యలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ యొక్క సంప్రదింపులతో, తూర్పుతీరంలో తీర ప్రాంత ఫిరంగి బురుజుపై తిరుగుబాటు కోసం ప్రయత్నించారు. ఇవన్నీ కూడా రక్తంలో ముంచెత్తబడ్డాయి. ఈ వార్తలు ప్రజలకు చేరకుండా దాచిపెట్టారు. సోషలిస్టులు తరచుగా ఈ పోరాటాలలో పాల్గొనేవారు.

బర్మాలోని భారత సైనికులు తమ స్వదేశానికి చెందిన ‘ఇండియన్ నేషనల్ ఆర్మీ’ని కలిశారు. వారిని నిజంగా తమ శత్రువులుగా అంగీకరించలేకపోయారు. ఇది ఒక గందరగోళ పరిచే అనుభవం. చాలామంది ఐఎన్ఏ వారు జపాన్‌వారి సహాయంతో స్వాతంత్ర్యం కొరకు జరుగు యుద్ధంలో పోరాడుతున్నామని త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నారు. అదే సందర్భంలో జపనీయులు బ్రిటీషు వారికంటే ఉత్తమంగా తమను గౌరవంగా చూడటం లేదని, చిత్తమొచ్చి నట్లుగా బలిపశువులుగా వినియోగిస్తున్నారని తెలుసుకున్నారు. విదేశీ ఆధిక్యతకు వ్యతిరేకంగా నిజమైన స్వాతంత్ర్య పోరాట వాస్తవం ఎక్కడ వుంది? ఈ బహుముఖమైన, తరచుగా విరుద్ధ అనుభవాలు – భారత సాయుధబలగాలలో కనిపించని అల్లకల్లోలానికి కారణమైంది. నూతన గుర్తింపుకొరకు అన్వేషణ ప్రారంభమైంది. వారు కిరాయి సైనికులా? లేక జాతీయవాదులా? ఐఎన్ఏ సైనికులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. వారే బానిసలు అయినప్పటికిన్నీ, విముక్తి చెందించేవారిగా స్వాగతించబడ్డారు. ఐఎన్ఏ పోరాడుతున్న దేశాలతోసహా,

ఇపుడు బానిసలే, విముక్తి చేసేవారిగా మారినవారు, తమ స్వంత దేశాలలో స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొనదలిచారు.

యుద్ధంలో అలసి స్వదేశానికి వస్తున్న భారతీయ సైనికులు, దేశంలోని జాతీయ వాదుల, విప్లవకారుల నాయకత్వం ముందుకు వచ్చి, తమకు అవసరమైన త్రోవ చూపుతారా? అని ఆలోచించారు. వారి మనసులలో ముఖ్యమైన ప్రశ్న ఇది. ఈ ముఖ్యమైన ప్రశ్నకు జవాబు చెప్పబడకుండా మిగిలిపోయింది.

వారు అసంతృప్తితో మరుగుతున్న భారత దేశానికి తిరిగివచ్చారు. ఐఎన్ఏ నాయకత్వాన్ని విడుదల చేయుటకు ప్రజాబాహుళ్యం చేస్తున్న తక్షణ రాజకీయ పోరాటాలకు కాంగ్రెస్ బాసటగా నిలబడింది. సామ్రాజ్యవాద వ్యతిరేక హింసాయుత పోరాటం చేస్తున్న సాయుధ బలగాలలో కొందరిని క్షమించి, జాతీయోద్యమ అహింసాయుత నాయకత్వం తమలో కలుపుకొంది. కొందరు అమాయకులు ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా తాము కూడా తిరగబడితే, జాతీయ నాయకత్వం తమతోనే నిలబడుతుందని గుడ్డిగా నమ్మారు. అపూర్వమైన స్థాయిలో జాతీయ తిరుగుబాటుకు పరిస్థితులు నిజంగా పక్వమయ్యాయి. 1942లో వచ్చిన విప్లవ రైతాంగ పోరాటాల జ్ఞాపకాలు ఇంకా తాజాగానే వున్నాయి. యుద్ధానంతరం కార్మికుల సమ్మె పోరాటాలు ప్రారంభమయ్యాయి. లెనిన్ పేర్కొన్న విధంగా – కార్మికవర్గంయొక్క సాధారణ రాజకీయ సమ్మె, రైతాంగ తిరుగుబాట్లు, సాయుధ దళాలలోని కొందరు ప్రజలవైపు చేరడం – విప్లవంలోని మూడు పాయలు కలిసి పనిచేయడానికి అవకాశాలు తెరుచుకొన్నాయి.

బ్రిటీషు వాయుసేన, భారతీయ వాయు సేనలలో జరిగిన సమ్మెలు నావికాదళంలో ప్రణాళికాబద్ధమైన ప్రయత్నాల ప్రారంభానికి దారితీశాయి. 1945 డిసెంబరు నుండి బొంబాయి తీరదళం హెచ్ఎంఎస్ తల్వార్‌లో సంఘటనల క్రమం చోటుచేసుకుంది. అణచివేత మొదలుకాగానే కొందరు నావికులు కమ్యూనిస్టు, సోషలిస్టు నాయకుల మార్గదర్శకత్వం కోరారు. అక్కడ ప్రతికూలతా లేదు, నిర్దిష్టమైన మార్గ దర్శకత్వమూ అందలేదు. ఈ రకమైన పరిస్థితులలో 1946 ఫిబ్రవరి 18 ఉదయం నావికాదళ తిరుగుబాటుకు ప్రారంభకంగా ఫిరంగులు పేలాయి. మొదటినుండీ నౌకరీ పరిస్థితులలో వుండే అసంతృప్తులకు జాతీయ స్వాతంత్ర్య పోరాటపు రాజకీయ కోరికలు జత చేయబడ్డాయి.

ఫిబ్రవరి 18 సంఘటనల యొక్క ప్రభావం భారతదేశంలోని, విదేశీల్లోని ఓడరేవులలో వున్న నౌకాదళ సిబ్బందిపై పడింది. భారతీయ నౌకాదళం అక్షరాలా నావికుల చేతుల్లోకి వెళ్ళింది. సరైన సంబంధాలు లేని కారణంగా, మిగతా సాయుధ దళాలలో తిరుగుబాటును వ్యాప్తిచేయాలన్న ప్రణాళిక ఫలవంతం కాలేదు. ఐనప్పటికీ నావికాదళ తిరుగుబాటుదారులపైకి బ్రిటీషువారు భారతీయ సైన్యాలను, వైమానిక దళాల్ని పంపడానికి సాహసించలేదు. మార్క్స్ చెప్పినట్లు "మొదటి సాధారణ ప్రతిఘటనా కేంద్రం" తిరిగి చురుకుగా ముందుకొచ్చింది. భారతదేశంలో బ్రిటీషు సామ్రాజ్యంయొక్క పునాదులు కదిలాయి.

జాతీయ నాయకత్వం నావికాదళ తిరుగుబాటును నిరోధించటానికి త్వరపడింది. 'ఇలాంటి వికృత పరిణామాలు, శాంతియుత అధికారమార్పిడి కొరకు జరుగు మంతనాల యొక్క సౌందర్యాన్ని చెడగొట్టటాన్ని ఎంతమాత్రం అంగీకరించరాదని' గాంధీ ప్రకటించాడు. జాతీయ నాయకత్వంయొక్క మద్దతు పొందాలని శ్రీమతి అరుణా అసఫ్ఆలీ చేసిన వ్యర్ధ ప్రయత్నాలను గాంధీ తన అసమాన సౌమ్య వైఖరితో మందలించాడు. కాంగ్రెస్, ముస్లింలీగ్ రెండూ కూడా నావికులను లొంగిపొమ్మని సలహా ఇచ్చి, నావికులకు ఎలాంటి హానీ జరగబోదని హామీ ఇచ్చాయి. కానీ ఈ హామీ నిలుపుకోలేదు.

సరైన రాజకీయ మార్గదర్శకత్వం లోపించటం, అనుభవాల లేమివలన నావికా తిరుగుబాటు నాయకత్వం డోలాయమానంలో పడి లొంగిపోయింది. సరిగ్గా ఈ సమయంలోనే కార్మికులను వీధులలోకి వచ్చి బ్యారికేడ్లు ఏర్పరచమని నావికులను బ్యారికేడ్లపైకి ఆయుధాలతో సిద్ధంకమ్మని కమ్యూనిస్టులు పిలుపునిచ్చారు. బొంబాయిలో 200మంది కార్మికుల, వారి నాయకుల నరమేధం జరిగింది. బ్రిటీషర్లకు మిలటరీ బలంతో దేశాన్ని బానిసత్వంలో వుంచలేమని అర్ధమయింది. జాతీయ నాయకత్వం శక్తిని పొంది, గతంతో పూర్తి స్థాయిలో విడగొట్టుకొని విప్లవాత్మకంగా పురోగమిస్తే వారిని నిరోధించలేమనే నిర్ణయానికి వచ్చింది. అందువలన ఒప్పందానికి సిద్ధమై, కేవలం ఆరు నెలలలోనే ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నారు.

మన స్వాతంత్ర్య పోరాట విజయంలో భారత సాయుధ దళాల సహకారం నేటికీ గుర్తించనిదిగానే వుంది. నావికాదళ తిరుగుబాటు మన క్లిష్టమైన జాతీయోద్యమ చరిత్రలో ప్రస్తావనగా మాత్రమే వుంది. మన దేశంలో సాగిన ఉద్యమం–మిక్కిలి జాగ్రత్తగా నిర్వహించిన మిధ్యాపూర్వక ఏకైక రక్తరహిత విప్లవం" ససేమిరా కాదు. మన పెటీబూర్జువా విప్లవ కారులను గౌరవంతో స్మరించుకోవాలి. 1857 తిరుగుబాటు మన మొదటి స్వాతంత్ర్య పోరాటంగా గుర్తించాలి. చివరికి ఐఎన్ఏను కూడా పూజనీయులుగా స్వీకరించాలి. దీని యొక్క కొన్ని ముఖ్యమైన వెలుగులు పునాదుల్లోనే ఆవిరైపోయాయి. నావికాదళ తిరుగుబాటు, ఇతర సాయుధ తిరుగుబాట్లపై నిశ్శబ్దపు ముసుగు వేయబడింది. ఇది నిజంగా ఎందు కంటే గాంధీ నిజాయితీగా ఫిబ్రవరి 1946లో అంగీకరించినట్లు, ప్రతిపాలక వర్గం సైనికుల యొక్క రాజద్రోహానికి భయపడింది. తిరస్కరణకు గురైన వారిని ఏదో ఒకరోజు దేశం గౌరవిస్తుందని ఆశిద్దాం.

oooo